సాక్షి మహబూబాబాద్

సోమవారం | 8 | ఏప్రిల్ | 2024



జాతరకు వేళాయె..

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామశివారులోని గుట్టపై ఉగాది రోజు కులమతాలకు అతీతంగా పకీర్ షావలీ జాతర నిర్వహించనున్నారు. - 8లో▸



ముగిసిన అంత్యక్రియలు

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు సంతోష్ అంత్యక్రియలు భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దస్తగిరిపల్లిలో ఆదివారం పూర్తయ్యాయి. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.4^{0} /22.2^{0}

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ 6:36	మంగళ 4:42

న్యూస్‌రీల్

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



మహబూబాబాద్ అర్బన్/నెల్లికుదురు: జిల్లాలో మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ రామారావు ఆదివారం తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి వరకు 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జిల్లాలో 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిందని, మొత్తం 1343 మంది విద్యార్థులకు 1107 మంది హాజరయ్యారన్నారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగాయని, 1043 మంది విద్యార్థులకు 859 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలోని గుర్తూరు, నెల్లికుదురు సెంటర్లను పరిశీలించామన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

నెహ్రూసెంటర్: జిల్లాలోని ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయొద్దని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి ఆదివారం తెలిపారు. వైద్యం వికటిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. కొన్ని సందర్భాల్లో రోగులు మృతిచెందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ప్రథమ చికిత్స వైద్యం చేసే వ్యక్తులు నిబంధనలుపాటించకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రథమ చికిత్స కేంద్రం ముందు సూచిక బోర్డులపై ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లేదా ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ప్రదర్శించాలని సూచించారు.

రేపటి నుంచి శ్రీరామ నవమి నవరాత్రులు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి దేవాలయంలో మంగళవారం నుంచి శ్రీరామనవమి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ఉదయం 5 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకాలు, శ్రీరామ దశాక్షర మంత్ర హోమం, నవగ్రహ సహిత సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తామని ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సాయంత్రం పంచాంగశ్రవణం, కవిసమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఈనెల 17న బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయప్రాంగణంలో రాముల వారి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

16 నుంచి ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. 16న మొదటి పేపర్ సైంటిఫిక్ ప్రిన్సిపల్స్ ఆఫ్ స్పోర్ట్స్ ట్రైనింగ్, 19న స్పోర్ట్స్ మెడిసిన్, 22న హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ న్యూట్రిషన్, 24న స్పోర్ట్స్ఇంజనీరింగ్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న కామేశ్వరాలయ పనులు

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా పేరొందిన రామప్ప దేవాలయం పక్కన గల కామేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు పది రోజులుగా కొనసాగుతున్నాయి. 13 ఏళ్లుగా మూలనపడ్డ కామేశ్వరాలయ శిల్పాలు శీర్షికన గత నెల 27న సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కేంద్ర పురావస్తుశాఖ అధికారులు ఆలయ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. పది రోజులుగా పునాది రాళ్లను తొలగించేందుకు రెండు మీటర్ల వరకు తవ్వకాలు చేపట్టారు. ఆదివారం నుంచి కామేశ్వరాలయం లోపల ఉన్న ఇసుకను తొలగించడంతో పాటు రెండు లేయర్లుగా ఉన్న ఆలయ పునాదిరాళ్లను క్రేన్ సహాయంతో తొలగిస్తున్నారు. మూడు నెలల్లోగా కామేశ్వరాలయానికి ఫౌండేషన్ వేయనున్నట్లు పురావస్తుశాఖ అధికారులు చెబుతున్నారు.

పేరుకే నిషేధం!

- పట్టణాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
- నియంత్రణ చర్యలపై నిర్లక్ష్యం
- మున్సిపాలిటీల్లో పర్యవేక్షణ కరువు



తొర్రూరులో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపాలిటీ సిబ్బంది(ఫైల్)

తొర్రూరు: పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్ల వినియోగం పట్టణాల్లో యథేచ్ఛగా సాగుతోంది. 2022 జూలై 1నుంచి సింగిల్ యూజ్ వస్తువులను నిషేధిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. అప్పటి నుంచి కఠిన ఆంక్షలు అమల్లోకి రాగా తనిఖీలు చేస్తూ చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల పాటు హడావుడి చేసిన అధికార యంత్రాంగం తర్వాత అటకెక్కించారు. జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల్లో నిబంధనలు అమలు కావడం లేదు. కాగా 120 మైక్రాన్ల లోపు కవర్లు, వస్తువులను తయారు చేయడం, అమ్మడం, వినియోగించడానికి వీలులేదు. దీంతో నెల రోజుల పాటు మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి వ్యాపారుల దగ్గర ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు.

మార్పు వచ్చే సమయంలో...

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్‌ను నిషేధించడంతో వ్యాపారులు సైతం పాలిథిన్ కవర్లను వినియోగించడాన్ని నిలిపివేశారు. ఇంటి నుంచే సంచులు తీసుకురావాలని వ్యాపారులు సూచించడంతో ప్రజలు కూడా అనుసరించారు. అయితే తర్వాత వ్యాపారులు అన్ని వస్తువులు ప్లాస్టిక్‌లోనే ఇస్తుండడంతో మళ్లీ మొదటికొచ్చింది. మున్సిపాలిటీల్లో తనిఖీలు చేయకపోవడంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌మయమైంది. ఒకసారి వాడి పడేసే వస్తువులు విపరీతంగా వాడుతున్నారు. ఏ శుభకార్యం జరిగినా కల్యాణ మండపాలు, హోటళ్లు, కర్రీ పాయింట్ల నుంచి ప్యాకింగ్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, చెంచాలు, మిఠాయి డబ్బాలు, కప్పులు వేల సంఖ్యలో బయటకు వస్తున్నాయి.

నేరుగా వ్యాపారులకు సరఫరా..

హోల్‌సేల్, రిటేల్ ప్లాస్టిక్ దుకాణాల్లో ఒకసారి వాడి పడేసిన వస్తువులను మున్సిపాలిటీ అధికారులు స్వాధీనం చేసుకుంటుండటంతో కొందరు కొత్త రకం వ్యాపారానికి తెర లేపారు. ద్విచక్ర వాహనంపై సంచుల్లో పెట్టుకుని వ్యాపారుల దగ్గరికి వచ్చి పాలిథిన్ సంచులు సరఫరా చేస్తున్నారు. ఈ దందా ఎప్పటి నుంచో ఉండగా గత రెండు నెలలుగా పట్టణాల్లో తిరుగుతూ ప్లాస్టిక్ సంచులు విక్రయించే వారి సంఖ్య పెరిగినట్లుగా తెలుస్తోంది. కాగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు నామమాత్రంగా కనిపిస్తున్నాయి. తనిఖీలు చేస్తున్న సమయంలో రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో చేసేదేమి లేక వెనక్కి వస్తున్నట్లు తెలిసింది.

కమిటీ తనిఖీలు ఏమైనట్లో?

ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను పూర్తిగా నిషేధించడంతో మున్సిపాలిటీల్లో అమలు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. కాగా కమిషనర్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఎన్‌జీఓ, పోలీస్ కానిస్టేబుల్ కమిటీలో ఉంటారు. వీరంతా రోజూ పరిశీలించడంతో పాటు ప్రజలకు ప్రత్యామ్నాయంగా వాడుకునే వస్తువులను వివరించాల్సి ఉంటుంది. అయితే ఈ కమిటీ ఎక్కడ ఉందో కనిపించడం లేదు. శానిటేషన్ సిబ్బంది పలు దుకాణాలు తిరిగి వస్తున్నారు. సిబ్బంది పూర్తిగా పారిశుద్ధ్య నిర్వహణ పనులకే పరిమితమవగా ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి



నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే విక్రయదారులకు అవగాహన కల్పించాం. తనిఖీలు ముమ్మరం చేసి ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్నాం. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించేందుకు అందరూ సహకరించాలి. అందరి సహకారంతో ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రిస్తాం.

- శాంతికుమార్,
మున్సిపల్ కమిషనర్, తొర్రూరు

రైల్వేస్టేషన్‌లో అరకొర షెడ్లు

- ఎండలతో ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- హామీలు ఇస్తున్నారు.. ఆచరణలో అశ్రద్ధ



మహబూబాబాద్ రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫారంపై అరకొర షెడ్లు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణికుల నీడ కోసం షెడ్ల ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

ఆదాయం ఉన్నా..

మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 27సెట్ల రైళ్లు అప్ అండ్ డౌన్ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణికుల ద్వారా రోజుకు సుమారు రూ.4లక్షల వరకు ఆదాయం రైల్వేశాఖకు సమకూరుతున్నట్లు అధికారులు తెలిపారు. నిత్యం సాధారణ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు వేలాది మంది మహబూబాబాద్‌కు వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో ప్రయాణికులు సేద తీరేందుకు సరైన నీడతో కూడిన షెడ్లు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై ఐదు షెడ్లు, రెండో ప్లాట్‌ఫారంపై నాలుగు షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ క్రమంలో వేసవికాలం కావడంతో ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. అయితే ప్రయాణికులకు సరిపడా షెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడో ఓ చోట నీడన ఉండి... రైళ్లు రాగానే పరుగెత్తుకెళ్లి ఎక్కుతున్నారు. వర్షాకాలంలో వానలో తడిసి ప్రయాణం చేయాల్సిందే. కాగా దక్షిణ మధ్య రైల్వేశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రైల్వేస్టేషన్‌లో సమస్యలపై ప్రజలనుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి వెళ్తున్నారే తప్ప.. పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌లో పూర్తిస్థాయిలో షెడ్లు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: సర్వమతాలకు నిలయంగా భారతదేశం నెలకొందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశస్విని మాట్లాడుతూ.. సమాజంలో అన్ని రకాల సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ముస్లిం నాయకులు యాకూబ్, ఎండీ నజీర్, ఎండీ సలీం, అబ్బాస్ అలీ, ఎండీ సలాం, సాహు హుస్సేన్, ఎండీ సర్వర్‌ఖాన్, మండల నాయకులు నిరంజన్ రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, కాకిరాల హరిప్రసాద్‌రావు, పులి గణేష్, సురేష్ నాయక్, రాఘవరావు పాల్గొన్నారు.

భవనం పూర్తయ్యేనా?



నిలిచిపోయిన కేజీబీవీ నూతన భవన నిర్మాణం



భవనంలో తాగి పడేసిన బీరు సీసాలు

- మధ్యలోనే నిలిచిపోయిన కేజీబీవీ భవన నిర్మాణం
- గిరిజన బాలుర వసతిగృహంలో పాఠశాల నిర్వహణ
- వసతుల లేమితో విద్యార్థినుల ఇబ్బందులు
- వచ్చే విద్యా సంవత్సరంలో భవనం అందుబాటులోకి తేవాలని డిమాండ్

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల గిరిజన బాలుర వసతి గృహంలో కొనసాగుతోంది. ప్రస్తుతం పదో తరగతి వరకు 190 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం కేజీబీవీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించింది. నిర్మాణం పూర్తి దశకు చేరుకునే సరికి.. స్థల వివాదంలో కోర్టులో కేసు నడుస్తుంది. దీంతో పనులు నిలిచిపోయి.. ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. కాగా కోర్టులో కేసును పరిష్కరించుకొని వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థినులకు భవనాన్ని అందుబాటులోకి తేవాలని తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేస్తేమేలు..

వచ్చే విద్యా సంవత్సరంలో కేజీబీవీని అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యను అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు. భవన నిర్మాణం పూర్తి చేసి ఇంటర్ విద్య అందిస్తే స్థానిక విద్యార్థినులకు మేలు జరుగుతుందని అంటున్నారు.

కనీస వసతులు కరువు..

ప్రస్తుతం కొనసాగుతున్న గిరిజన బాలుర వసతి గృహంలో కనీస వసతి సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులకు బాత్‌రూంలు సరిపోవడం లేదు. ల్యాబ్, లైబ్రరీ సౌకర్యం, సరైన క్రీడామైదానాలు లేవు. దీంతో అరకొర సౌకర్యాల మధ్య చదువుకోవాల్సి వస్తుందని విద్యార్థినులు వాపోతున్నారు.

విద్యార్థినులకు ఇబ్బందులు



గిరిజన బాలుర వసతి గృహంలో కొనసాగుతున్న కేజీబీవీలో కనీస సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా బాత్‌రూంలు లేకపోవడంతో షిఫ్టులవారీగా వినియోగించుకుంటున్నారు. నూతన భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

- లలిత, కేజీబీవీ ఎస్‌ఓ

బైబై స్ప్రింగ్ స్ప్రీ-24

అట్టహాసంగా ముగిసిన రాసెంగాన్

- చిట్‌చాట్‌లో అలరించిన హీరో నవదీప్
- లెట్స్‌టాక్‌లో సినీ డైరెక్టర్ రాఘవపూడి..



పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల వసంతోత్సవ స్ప్రింగ్ స్ప్రీ–24 రాసెంగాన్ ఆదివారం అట్టహాసంగా ముగిసింది. విద్యార్థులు 35కు పైగా ఈవెంట్లలో ఉత్సాహంగా పాల్గొని సంస్కృతీ సంప్రదాయాలను పరస్పరం పంచుకున్నారు. ఆదివారం ముగింపు సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన చిట్‌చాట్ కార్యక్రమంలో సినీ హీరో నవదీప్, లెట్స్ టాక్‌లో సీతారామం సినీ డైరెక్టర్ హను రాఘవపూడి సందడి చేశారు.

వాట్సప్ ఎన్‌ఐటీ : నవదీప్

నిట్ అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన చిట్‌చాట్‌లో పాల్గొన్న సినీ హీరో నవదీప్ 'వాట్సప్ ఎన్ఐటీ' అంటూ విద్యార్థులను పలకరించారు. 'నేను మీలాగే స్టూడెంట్ లైఫ్‌ను ఎంతో ఎంజాయ్ చేశాను. నేడు సెలెబ్రిటీగా రావడం ఆనందంగా ఉంది. ఎన్నో సినిమాలు చేసి ఆప్ అండ్ డౌన్స్ చూసిన నాకు లాక్ డౌన్ సరికొత్త అనుభవాన్ని అందజేసి నవదీప్ 2.0గా మార్చి నూతన జీవితాన్ని ఇచ్చింది' అని చెప్పారు. 'నాకు నేనుగా ఏర్పాటు చేసుకున్న వంద రోజుల పంచాయితీలో నిత్యజీవితంలో ఎలా ఉండాలో నేర్చుకున్నాను. రియాల్టీ షోలో పాల్గొనడంలో మరిచిపోలేని అనుభూతి కలిగింది' అని అన్నారు. సమాజాన్ని అధ్యయనం చేసేందుకు ప్రతి ఒక్కరూ ట్రావెలింగ్ చేయాలని, వివిధ ప్రదేశాలను సందర్శించినప్పుడు సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. 'నా సెకండ్ ఇన్నింగ్స్‌ను నా ఫ్రెండ్స్ రూపొందించిన 'లవ్ మౌళి' సినిమా చూస్తే తెలుస్తుంది. అది నాకథ అనే విధంగా తలపిస్తుంది. టాలెంట్ ఉంటే అవకాశం వెతుక్కుంటూ వస్తుంది' అని వివరించారు.



మాట్లాడుతున్న హీరో నవదీప్

అవరోధాలను అధిగమిస్తేనే సక్సెస్ : హను రాఘవపూడి



మాట్లాడుతున్న రాఘవపూడి

మనకు ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తేనే సక్సెస్ సాధ్యమవుతుందని సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి టాక్‌షోలో మాట్లాడారు. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేందుకు లవ్ మూవీస్, కుటుంబ నేపథ్యంతో రూపొందించడమే నా అభిరుచి.. ఈ మేరకు సీతారామం సినిమాకు శ్రీకారం చుట్టానని చెప్పారు. మైనస్ 24 డిగ్రీలలో సీతారామం సినిమాను కశ్మీర్‌లో 11 రోజుల పాటు చిత్రీకరించడంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని, అయినా వెనుదిరగకపోవడం వల్లే సీతారామం ఆడియన్స్‌కు అంత కనెక్ట్ అయ్యిందని చెప్పుకొచ్చారు. మీలో కథ రాసే టాలెంట్ ఉంటే.. దానిని సోషల్ మీడియా వేదికగా అందజేస్తే అవకాశాలు వస్తాయి.. తెలుగు సినిమా ఇండస్ట్రీ నూతన టాలెంట్స్ కోసం ఎదురుచూస్తోందని అన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమణ

నెహ్రూసెంటర్: పూలే, అంబేడ్కర్ ఆశయ సాధనకు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ప్రజాసంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న పూలే, 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ నెల 21న మహనీయుల జయంతులను పురస్కరించుకుని జనజాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జ్ రాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, చేతివృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, గొర్రెల కాపరుల సంఘం నాయకులు గంద్రకోటి కుమార్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మండ విక్రంగౌడ్, రజక సంఘం నాయకులు దుగ్గి లక్ష్మీనారాయణ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.


హేమాచలక్షేత్రంలో పూజలు



అదనపు కలెక్టర్‌కు ఆలయంలోకి స్వాగతం పలుకుతున్న పూజారులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరులో గల శ్రీహేమాచల క్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్య ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో మొదటి సారిగా ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు, శేఖర్‌శర్మ, ఈశ్వర్‌చంద్ రామానుజం మర్యాద పూర్వకంగా ఆలయంలోకి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని స్వామివారికి వారి గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు చేసి స్వామివారి విశిష్టత, ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల శేష వస్త్రాలను బహుకరించి వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మల్లన్నకు పెద్దపట్నం



మల్లన్న పెద్దపట్నం

ఐనవోలు: శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సంక్రాంతి నుంచి జరుగుతున్న జాతర చివరి ఆదివారం మహా పెద్ద పట్నం, గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లన్న కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి నిత్య పూజలు పూర్తయిన తర్వాత ఆలయ ప్రాంగణంలో నటరాజ స్వామి మండపానికి ఎదురుగా ఒగ్గు పూజారులు మహా పెద్దపట్నం వేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అమ్మవార్లు గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మ, మల్లికార్జునుడి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో నటరాజ స్వామి వేదికపైకి తీసుకువచ్చి కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, ఒగ్గు పూజారులు పెద్ద మనుషులు మజ్జిగ మహేందర్, మల్లయ్య, వెంకట నారాయణ కార్యక్రమం నిర్వహించగా.. ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు పర్యవేక్షించారు.



పెద్దపట్నంపై భక్తుల నృత్యాలు

ఎండుతున్న మొక్కలు

డోర్నకల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు, చెట్లు నీరందక ఎండుతున్నాయి. సుమారు మూడు సంవత్సరాల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా జామ, నిమ్మ, దానిమ్మ, బాదం లాంటి మొక్కలను నాటారు. జామ, నిమ్మ, దానిమ్మ లాంటి మొక్కలు కాపు దశకు రాగా నీటి వసతి లేకపోవడంతో మొక్కలు ఎండుతున్నాయి. సబ్‌స్టేషన్ ఆవరణలోని చేతిపంపులో నీరు ఇంకిపోవడం, ఇతర ఎలాంటి నీటి వసతి లేకపోవడంతో పాటు ఎండ తీవ్రత పెరగడంతో మొక్కలు ఎండుతున్నాయి. సబ్ స్టేషన్ ఆవరణలో చేతిపంపునకు మరమ్మతులు చేయించి మొక్కలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎండిన నిమ్మ మొక్కలు



ఎండుతున్న నిమ్మ, దానిమ్మ మొక్కలు

వరిపంటకు చీర రక్షణ

కేసముద్రం: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వానరాలు ధ్వంసం చేస్తున్నాయి. ఈక్రమంలో పంటను కాపాడుకోవడానికి రైతు వినూత్నంగా చుట్టూ చీరలను కట్టిన ఘటన మండల కేంద్రంలోని బడితండా చోటుచేసుకుంది. తండాకు చెందిన ఓ రైతు సాగుచేసిన వరి పంట చేతికందే సమయంలో కోతులు గుంపులుగుంపులుగా వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. ఇది గమనించిన రైతు ఆలోచన చేసి, పంటకు రక్షణగా చీరలను చుట్టూరా కట్టాడు. ఈ దృశ్యం ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.



బడితండాలో వరి పంటకు రక్షణగా చీరలు చుట్టిన రైతు

క్లుప్తంగా

రేషన్‌ బియ్యం స్వాధీనం

జఫర్‌గఢ్‌ : మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో పోలీసులు.. ఎన్నికల బృందంతో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా 33.5 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టుబడినట్లు ఎస్సై రవియాదవ్‌ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌ ఎన్నికల్లో భాగంగా ఉప్పుగల్లులో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యంతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో పాటు కేసు నమోదు చేశామని వెల్లడించారు.

లింగ నిర్ధారణ కేంద్రంపై పోలీసుల దాడి

కురవి : లింగ నిర్ధారణ కేంద్రంపై పోలీసులు దాడులు చేసిన ఘటన మహబూబాబాద్‌ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్య తండా జీపీ పరిధిలోని పిల్లిగుండ్ల తండాలో ఆదివారం చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కెకన్‌ ఆదేశాల మేరకు పోలీసులు పిల్లిగుండ్ల తండాకు చెందిన బి.శివ అనే ఆర్‌ఎంపీ వైద్యం నిర్వహించే వ్యక్తి ఇంట్లో లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఇంటిపై దాడులు నిర్వహించారు. లింగనిర్ధారణ పరీక్షల కోసం ఖమ్మం జిల్లా నుంచి సమ్మయ్య అనే వ్యక్తి కొందరు మహిళలను పిల్లిగుండ్ల తండాకు తీసుకొచ్చాడు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పోలీసులు శివ ఇంటిపై దాడి చేశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు పారిపోగా ఆరుగురు పట్టుబడినట్లు విశ్వసనీయ సమాచారం. లింగ నిర్ధారణ చేసేందుకు ఉపయోగించిన స్కానర్‌తోపాటు శివ, సమ్మయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని స్కానర్‌ను సీజ్‌ చేసి కురవి పోలీసులకు అప్పగించారు. ఇదే విషయమై ఎస్సై గోపిని వివరణ కోరగా దాడులు చేసింది వాస్తవమేనని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

రూ. 6 లక్షల నగదు సీజ్‌


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

నర్సంపేట రూరల్‌ : ఆధారం లేకుండా తరలిస్తున్న నగదును సీజ్‌ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌ తెలిపారు. నర్సంపేట మండలం గుంటూరుపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌, మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ ఆదివారం తన వాహనంలో ఆధారం లేకుండా రూ. 6 లక్షలు తీసుకెళ్తోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట మండలం మహేశ్వరంలో తనిఖీ చేస్తుండగా పార్వతమ్మ వాహనంలో రూ. 6 లక్షలు లభ్యమయ్యాయి. దీంతో ఆ డబ్బును సీజ్‌ చేసి పీఎస్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నర్సింహులపేట : ఆర్థిక ఇబ్బందులు, గొడవలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. ఎస్సై గండ్రాతి సతీష్‌ కథనం ప్రకారం.. మండలంలోని ఎర్ర చక్రుతండాకు చెందిన జాటోత్‌ శ్రీను (43) ఆర్థిక ఇబ్బందులు, ఇంట్లో భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో క్షణికావేశంలో ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీనును చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శ్రీనుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య మాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పకీర్‌ షావలీ జాతరకు వేళాయె..

రేపు ఎల్కతుర్తి మండలం దామెరలో ప్రారంభం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- మత సామరస్యానికి ప్రతీక పకీర్‌ షావలీ దర్గా
- నిరంతర సేవలతో ప్రజల గుండెల్లో నిలిచిన వైద్యుడు

ఎల్కతుర్తి: పకీర్‌షావలీ దర్గా.. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతీ సంవత్సరం ఉగాది పర్వదినాన నిర్వహించే ఈ జాతరకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామ శివారులో ఉన్న గుట్టపై ఏటా ఉగాది పర్వదినాన కులమతాలకతీతంగా పకీర్‌ షావలీ జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు గ్రామ ముజావర్లు గుట్టను ముస్తాబు చేశారు. పకీర్‌షావలీని స్మరిస్తూ హిందూ, ముస్లింలు కలిసి కట్టుగా ఉగాది రోజున జాతరకు తరలి వెళ్లి ఆయురారోగ్యాలతో తులతూగాలని వేడుకుంటారు.

వైద్యుడిగా పకీర్‌షావలీ..

సుమారు వందల ఏళ్ల క్రితం బ్రిటీష్‌ పాలకులు భారతదేశాన్ని పాలించిన సమయంలో ఆత్మకూరు వద్ద ఆర్మీ క్యాంపు ఏర్పాటు చేశారు. ఆ క్యాంపులో సయ్యద్‌ హజ్రత్‌ పకీర్‌షావలీ అనే దక్షిణ భారతానికి చెందిన వ్యక్తి వైద్యుడిగా ఉండేవాడు. ఆయన ఎక్కడ పనిచేసినా సమీప ప్రాంతాలను సందర్శించడం అలవాటు. ఈ క్రమంలో ఓసారి దామెర గ్రామానికి వచ్చాడు. అప్పటికి దామెరతో పాటు చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో గత్తర, లెప్రసీ లాంటి వ్యాధులు విస్తరించి నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారు. ఇక్కడి పరిస్థితిని చూసి పకీర్‌ చలించాడు. ప్రజలకు అనారోగ్య సమస్యలు పోయేవరకు ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాడు. కొన్నేళ్లపాటు వైద్యం అందించి ప్రజలను సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాడు. ఇందుకు ఆయన స్వస్థలంలో ఉన్న ఆస్తులు కూడా విక్రయించి పేదల వైద్యం కోసం వెచ్చించాడు. ఈ చర్యలతో పకీర్‌షావలీ.. ప్రజల గుండెల్లో దేవుడై నిలిచాడు. ఈ క్రమంలో వయసు మీదపడిన పకీర్‌ ఆరోగ్యం క్షీణదశకు చేరుకుంది. ఒక వేళ పకీర్‌ షావలీ మరణిస్తే ఏంచేయాలి అనే సందేహం గ్రామస్తులను పట్టుకుంది. అది గమనించిన పకీర్‌ షావలీ గ్రామ పెద్దలను పిలిచి తాను ఉగాది రోజు మరణిస్తానని, తన శవాన్ని మంచంపై తీసుకుని ముస్లిం మతాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తే చాలని చెప్పారు. దీంతో ముస్లిం సంప్రదాయం తెలియని గ్రామస్తులు.. ఇతర ప్రాంతం నుంచి లాల్‌మహ్మద్‌ అనే ముజావర్‌ (ఇస్లాం సంప్రదాయాలు తెలిసిన వ్యక్తి)ని తీసుకొచ్చారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ముస్లిలంతా ముజావర్‌ సంబంధీకులే. పకీర్‌ మరణం తర్వాత ఆయన మృతదేహాన్ని శ్మశానానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మంచం నుంచి అదృశ్యమైంది. దీంతో విస్తుపోయిన గ్రామస్తులు మృతదేహం కోసం చెట్లు, గుట్టల వెంబడి తిరిగినా ఎక్కడ కనబడకపోవడంతో బాధతో ఇంటికి వచ్చారు. అదేరోజు రాత్రి కొందరికి పకీర్‌షావలీ కలలో కనిపించి తాను ఎక్కడికి పోలేదని, గ్రామ శివారులోని రాతిగుట్టపై ఉన్నానని చెబుతాడు. మరునాడు గ్రామస్తులు గుట్టపైకి వెళ్లి చూడగా పకీర్‌ సమాధి సాక్షాత్కరిస్తుంది.


దామెరలోని పకీర్‌షావలీ గుట్ట


గుట్టపై పకీర్‌షావలీ సమాధి

జాతరకు వెళ్లడానికి మార్గం..

ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి జాతర జరిగే దామెర గ్రామం కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. హనుమకొండ, కరీంనగర్‌, సిద్దిపేట జిల్లాలను కలిపే ప్రధాన రహదారులపైన్నే ఎల్కతుర్తి మండల కేంద్రం ఉంటుంది. ఇక్కడి నుంచి ఆటోలు, ద్విచక్రవాహనాలపై రోడ్డు మార్గంలో దామెరకు చేరుకోవచ్చు. అలాగే, ధర్మసాగర్‌ నుంచి కూడా దామెరకు రవాణా మార్గం ఉంది.

దీర్ఘకాలిక వ్యాధులు నయం..

హనుమకొండ, సిద్దిపేట, కరీంనగర్‌ జిల్లాల సరిహద్దులో ఉన్న దామెరలో ఉగాది రోజు నిర్వహించే పకీర్‌షావలీ జాతరకు ప్రత్యేక విశిష్టతలు ఉన్నాయి. పకీర్‌షావలీని దర్శించుకుంటే దీర్ఘకాలిక రోగాలు నయమవడంతో పాటు సంతానం ప్రాప్తి చెందుతుందని ప్రజల విశ్వాసం. కష్టమైనా వయోభేదం లేకుండా సుమారు వంద మీటర్ల వరకు ఎత్తుండే గుట్టపైకి తాడు సాయంతో ఎక్కి పకీర్‌షావలీ సమాధిని దర్శించుకుంటారు. ఎల్కతుర్తితో పాటు భీమదేవరపల్లి, ధర్మసాగర్‌, హసన్‌పర్తి, హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, హుజూరాబాద్‌, హైదరాబాద్‌, పెద్దపల్లి ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి పకీర్‌షావలీ సమాధిని దర్శించుకుంటారు.

అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా పకీర్‌ షావలీ జాతరను నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఏ శుభకార్యం తలపెట్టినా పకీర్‌షావలీకి కందూరి నైవేద్యం పెట్టిన తర్వాతనే ప్రారంభిస్తారు.

ముగిసిన సంతోష్‌ అంత్యక్రియలు


సంతోష్‌ మృతదేహంతో గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- కన్నీటి వీడ్కోలు పలికిన అంకుషాపూర్‌
- నివాళులర్పించిన గ్రామస్తులు, పలు సంఘాల నాయకులు

కాటారం: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌ జిల్లా పూజారి కాంకేర్‌ సమీపంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అన్నె సంతోష్‌ అలియాస్‌ సాగర్‌ అలియాస్‌ శ్రీధర్‌ అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామం కాటారం మండలం అంకుషాపూర్‌ జీపీ పరిధిలోని దస్తగిరిపల్లిలో పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పలు సంఘాలు, మాజీ మావోయిస్టు నేతలు అన్నె సంతోష్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకుముందు విప్లవ గీతాలు, నినాదాలతో అంకుషాపూర్‌ నుంచి దస్తగిరిపల్లిలోని తన ఇంటి వరకు సంతోష్‌ మృతదేహాన్ని ర్యాలీగా తీసుకువచ్చారు. 23 ఏళ్ల తర్వాత సంతోష్‌ విగతజీవిగా రావడం చూసి గ్రామస్తులు బోరున విలపించారు. కాగా, అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శాంతక్క, సత్యవతి, విరసం నాయకులు బలసాని రాజయ్య, మహేందర్‌, శంకర్‌, ప్రగతిశీల నాట్యమండలి కళాకారులు నవత, పౌరహక్కుల సంఘం నాయకుడు వినోద్‌, ప్రజాఫ్రంట్‌ నాయకులు కొంరయ్య, రవి, తదితరులు.. సంతోష్‌కు నివాళులర్పించారు.

సాయంత్రం స్వగ్రామం చేరుకున్న సంతోష్‌ మృతదేహం..

కర్రెగుట్ట అడవుల్లో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో అన్నె సంతోష్‌ అలియాస్‌ సాగర్‌ మృతి చెందినట్లు బీజాపూర్‌ పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న కాటారం పోలీసులు సాయంత్రం అధికారికంగా నిర్ధారించారు. సంతోష్‌ మృతదేహాన్ని గుర్తించడానికి ఆదివారం అర్ధరాత్రి ఓ ప్రజాప్రతినిధి ద్వారా తల్లిదండ్రులు అన్నె ఐలయ్య, సమ్మక్కను బీజాపూర్‌కు పంపించారు. వారు ఉదయం అక్కడికి చేరుకునే లోగా సంతోష్‌గా భావించే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రుల గుర్తింపు కోసం ఉంచారు. వారు తమ కుమారుడే అని గుర్తించడంతో మృతదేహాన్ని అప్పగించారు. దీంతో సంతోష్‌ మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడానికి సాయంత్రమైంది.

కొనసాగిన పోలీసుల నిఘా..

సంతోష్‌ అంత్యక్రియల సమయంలో అడుగడుగునా పోలీసులా నిఘా కొనసాగింది. ఇంటెలిజెన్స్‌, సివిల్‌ పోలీసులు మఫ్టీలో సంతోష్‌ అంత్యక్రియలను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ నిఘా పెట్టారు.

తట్టుపల్లి టు ఢిల్లీ..

- 10, 11 తేదీల్లో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోనున్న లోహిత్‌
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కురవి: ఆ విద్యార్థి.. హోమియోపతి వైద్య విద్యనభ్యసిస్తూ మెదడుకు పదును పెట్టాడు.. మిత్రుల కన్నా ఏదో ఒక అంశంలో ప్రత్యేకత చాటుకోవాలనే తపన మొదలైంది. గైడ్‌టీచర్‌ సహకారంతో నిరంతరం పుస్తకాలతో కుస్తీ పట్టాడు.. ఎంచుకున్న తన గ్రంథాన్ని పూర్తి చేశాడు.. ఏకంగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకునే గౌరవం పొందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్‌ జిల్లా కురవి మండలం తట్టుపల్లికి చెందిన జంగం సామ్రాజ్యం, రవి దంపతుల కుమారుడు లోహిత్‌ సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్‌ హోమియోపతి మెడికల్‌ కళాశాలలో థర్డ్‌ ఇయర్‌ చదువుతున్నాడు. షార్ట్‌ టర్మ్‌ స్టూడెంట్‌షిప్‌ ఇన్‌ హోమియోపతి విభాగంలో ఆరు నెలలుగా 'ఆగ్రో హోమియోపతి' అనే అంశంపై రీసెర్చ్‌ చేస్తున్నాడు. గైడ్‌ టీచర్‌ శ్రీవిద్య సూచనల మేరకు లోహిత్‌.. రీసెర్చ్‌ పూర్తి చేశాడు. సెంట్రల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ రీసెర్చ్‌ హోమియోపతి ఆధ్వర్యంలో లోహిత్‌ గ్రంథానికి గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ హోమియోపతి డే సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఈనెల 10, 11 తేదీల్లో ఢిల్లీలో లోహిత్‌ అవార్డు అందుకోనున్నాడు. కాగా, ఈ అవార్డు తన తల్లిదండ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, భవిష్యత్‌లో వైద్య విద్యకు సంబంధించి మరిన్ని ప్రాజెక్టులు రూపొందిస్తానని లోహిత్‌ తెలిపారు. తన కొడుకు ఉన్నత స్థాయికి చేరుకోవడం ఆనందం కలిగించిందని రవి తెలిపారు. లోహిత్‌కు అవార్డు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


లోహిత్‌

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డాడు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


ఉమేష్‌ (ఫైల్‌)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులు, భార్యతో తగాదా కారణంగా ఓ యువకుడు మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఫతేషాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండ వీరయ్య, వీరమ్మ దంపతుల చిన్న కుమారుడు ఉమేష్‌ (32)కు ఏడాది క్రితం జనగామకు చెందిన చైతన్యతో వివాహం జరిగింది. ఉమేష్‌ వ్యవసాయ పనులు చూసుకోవడంతో పాటు జనగామలోని ఓ వైద్యురాలి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో చైతన్య పుట్టింటికి వెళ్లింది. ఉమేష్‌.. చైతన్యను తీసుకువస్తానని తండ్రితో చెప్పి శనివారం ఇంటినుంచి వెళ్లాడు. సాయంత్రం ఫోన్‌ చేసి అత్తగారింటి వద్ద గొడవ జరిగిందని తండ్రికి వివరించాడు. రాత్రి వరకు తండ్రి వేచి చూసినా కుమారుడు ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం వీరయ్య వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా అక్కడ కుమారుడి ద్విచక్రవాహనం కనిపించడంతో చుట్టు పక్కల వెతికాడు. సమీపంలోని చెట్టు కింద పడుకున్న కొడుకు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది విగత జీవిగా పడి ఉన్నాడు. పక్కన పురుగుమందు డబ్బా ఉండడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని బోరున విలపిస్తుండటంతో చుట్టు పక్క రైతులు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.

జేబులో సూసైడ్‌ నోట్‌ లభ్యం ..

పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఉమేష్‌ మృతదేహాన్ని పరిశీలించగా జేబులో సూసైడ్‌ నోట్‌ లభించింది. అందులో తనకు రూ 4. 75 లక్షల అప్పు ఉందని, ఆ అప్పు తీర్చాలని రాసి ఉంది. తన చావుకు ఎవరూ కారణం కాదని కూడా ఉంది. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు.

అశ్వరావుపల్లిలో డిగ్రీ విద్యార్థిని..


సోని మృతదేహం

రఘునాథపల్లి : డిగ్రీ పరీక్షలో ఫెయిల్‌ కావడంతో మనస్తాపం చెందిన విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. జనగామ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అశ్వరావుపల్లికి చెందిన మసి పరమేశ్‌ కూతురు సోని(20) హైదరాబాద్‌లో డిగ్రీ సెకండియర్‌ చదువుతోంది. అయితే ఆమె పరీక్ష ఫలితాలు రాగా ఫెయిల్‌ అయింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌ నుంచి నేరుగా నిడిగొండ రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే అధికారుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి మృతురాలి వద్ద లభించిన ఆధార్‌ కార్డుతో ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అశ్వరావుపల్లిలో మహిళ ..


మంజుల (ఫైల్‌)

రఘునాథపల్లి : క్షణికావేశంలో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అశ్వరావుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్యారాల సంతోష్‌-మంజుల (32) దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఆదివారం గ్రామంలో మైసమ్మకు పూజలు చేసి ఇంటికి వెళ్లారు. కాగా ఇంటికి వెళ్లిన అనంతరం కుటుంబ సభ్యుల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మంజుల ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతిపై వివరాలు సేకరిస్తున్నారు.

నాడు కుమారుడు.. నేడు తండ్రి..


- పురుగుల మందుతాగి ఆత్మహత్య
- కొండాయిల్‌పల్లిలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబం


రాజయ్య(ఫైల్‌)

నల్లబెల్లి: అనారోగ్యం కారణంతో 9 నెలల క్రితం కుమారుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనను మరవని తండ్రి కొంతకాలంగా మనస్తాపానికి గురవుతూ తాను కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొండాయిల్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాధారపు రాజయ్య (55) వ్యయసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అనారోగ్య కారణంతో 9 నెలల కిత్రం కుమారుడు నవీన్‌ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ ఘటనపై కొంతకాలంగా మనస్తాపం చెందుతున్న రాజయ్య.. పని నిమిత్తం శనివారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. వెంటనే వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూశారు. అక్కడ మొక్కజొన్న చేను సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి విగతజీవిగా కనిపించగా బోరున విలపించారు. అప్పుడు కుమారుడు, ఇప్పుడు తండ్రి.. తమను ఒంటరిని చేసి కనిపించని లోకాలకు వెళ్లారని దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాటర్‌ ట్యాంకర్‌ను ఢీకొట్టిన లారీ

- ట్యాంకర్‌ డ్రైవర్‌ మృతి


పరశురాములు (ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌ : వాటర్‌ ట్యాంకర్‌ ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ట్రాక్టర్‌ డ్రైవర్‌ మైల పరశురాములు(60) మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం ఘన్‌పూర్‌ డివిజన్‌కేంద్రంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఘన్‌పూర్‌ గ్రామానికి చెందిన పరశురాములు వాటర్‌ ట్యాంకర్‌ ట్రాక్టర్‌తో జాతీయ రహదారిపై డివైడర్‌ మీదున్న మొక్కలకు నీరు పోస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం మొక్కలకు నీరు పోస్తుండగా జనగామ నుంచి హనుమకొండ వైపునకు వెళ్లే లారీని (టీఎస్‌ 07 యూకే 5349) డ్రైవర్‌ అజాగ్రత్తగా నడుపుతూ ట్యాంకర్‌ను వెనుకనుంచి వచ్చి ఢీకొట్టాడు. దీంతో ట్రాక్టర్‌ బోల్తా పడి ట్రాక్టర్‌ డ్రైవర్‌ పరశురాములుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, ఈఘటనలో రంగారెడ్డి జిల్లా మాడ్గుల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌ కొప్పుల మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.


బోల్తా పడిన వాటర్‌ ట్యాంకర్‌ ట్రాక్టర్‌

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సైదులు(ఫైల్‌)

కురవి: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న మరో బైక్‌ ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కురవి ఎస్సై బి.గోపి కథనం ప్రకారం.. మహబూబాబాద్‌ మండలం మల్యాలకు చెందిన పరాల సైదులు(38), తన భార్య నీలమ్మ శనివారం బైక్‌పై ఖమ్మం జిల్లా పోచారంలోని తమ బంధువుల వద్దకు వెళ్లారు. తిరిగి కురవి మీదుగా మల్యాలకు వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 11గంటల ప్రాంతంలో కురవి వైజంక్షన్‌ వద్ద కురవి శివారు లింగ్యా తండాకు చెందిన లావుడ్య రమేష్‌ బైక్‌ వస్తూ వెనుక నుంచి సైదులు బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలైన సైదులును మహబూబాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడు సైదులు భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి ఆదివారం తెలిపారు.

హసన్‌పర్తిలో యువకుడు..


రాజు (ఫైల్‌)

హసన్‌పర్తి : కారు, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. హసన్‌పర్తి పెద్ద చెరువు మలుపు వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈమేరకు మృతుడి భార్య గిన్నారపు రాధ హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామానికి చెందిన గిన్నారపు రాజు(34) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పని నిమిత్తం ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై అన్నాసాగరం నుంచి హనుమకొండ వైపునకు బయలుదేరాడు. హసన్‌పర్తి పెద్ద చెరువు సమీపంలోకి చేరుకోగానే హనుమకొండ నుంచి కరీంనగర్‌ వైపునకు వెళ్తున్న కారు అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను ఢీకొంటూ రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం!

- యువకుడిని పట్టుకున్న బంధువులు
- చితకబాది పోలీసులకు అప్పగింత

ఖిలా వరంగల్‌: ఓ రెండేళ్ల చిన్నారిని కిడ్నాప్‌ చేసేందుకు యత్నించిన ఓ యువకుడిని బంధువులు, స్థానికులు పట్టుకున్నారు. అతడి చేతిలోని చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించి యువకుడిని చితకబాది మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన పడమరకోటలోని కుమ్మరికుంట తాటివనంలో జరిగింది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ తోటకు చెందిన ప్రజలు ఇటీవల గ్రామ దేవత బొడ్రాయి ప్రతిష్ఠాపనను పూర్తి చేసుకుని ఆదివారం పడమరకోటలోని కుమ్మరికుంట తాటి వనంలోకి వనభోజనాలకు వెళ్లారు. రోజు మొత్తం సంతోషంగా గడిపి మరి కాసేపట్లో తిరిగి ఇంటికి బయలుదేరుదామని అనుకునే సమయాన.. గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు ముళ్ల పొదల్లో మాటువేసి ఒంటరిగా కనిపించిన బాలికను ఎత్తుకుని వెళ్తుండగా ఆ చిన్నారి బంధువు గమనించాడు. ఈ ఘటనపై ఎవరు నీవు అని ప్రశ్నించగా అతడి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో బాలికలను కిడ్నాప్‌ చేస్తున్నాడని భావించి.. యువకుడి నుంచి చిన్నారిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం ఆ యువకుడిని బంధువులు, స్థానికులు చితకబాది మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్సై గోవర్ధన్‌ను వివరణ కోరగా విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.


చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు యత్నించిన యువకుడు


బాలికను చూపిస్తున్న తండ్రి

బస్సు ఆపట్లేదని దాడి..

తొర్రూరు : బస్సు ఆపడం లేదని ప్రయాణికులు సదరు బస్సుపై దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి తొర్రూరు బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన కథనం ప్రకారం.. తొర్రూరు నుంచి జగ్గిరిగుట్టకు వెళ్లే తొర్రూరు డిపో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసింది. బస్సు ఎక్కేందుకు బయట ఉన్న ప్రయాణికులు యత్నించగా డ్రైవర్‌ ఆపకుండా వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆగ్రహించిన ప్రయాణికులు బస్సు అద్దాలపై రాళ్లతో దాడి చేశారు. డ్రైవర్‌, కండక్టర్‌ బస్సును నిలిపి డయల్‌–100కు కాల్‌ చేయగా పోలీసులు చేరుకుని గొడవను సద్దుమణిగేందుకు చర్యలు తీసుకున్నారు. పలువురు ప్రయాణికులకు బ్రీత్‌ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహించి మద్యం తాగిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


వాగ్వాదం చేస్తున్న ప్రయాణికులు

హత్య కేసులో నిందితుల అరెస్ట్‌

చిట్యాల : హత్య కేసులో నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేష్‌ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని జడలపేటకు చెందిన కామని చిరంజీవి, విజయలక్ష్మికి 30 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా చిరంజీవి తాగుడుకు బానిసై కొంత భూమిని విక్రయించాడు. దీంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఇదే విషయంపై పెద్ద మనుషుల సమక్షంలో ఆమె పేరిట రెండెకరాల భూమి రాసి ఇచ్చారు. ఈక్రమంలో విజయలక్ష్మి పేరుపై ఉన్న భూమి కావాలంటూ చిరంజీవి, కుమారుడు గణేష్‌ తరుచూ గొడవ పడేవారు. దీంతో భూమి విక్రయించొద్దని అడ్డురావడంతో భర్త చిరంజీవితో పాటు కుమారుడు గణేష్‌ పథకం ప్రకారం శనివారం సాయంత్రం విజయలక్ష్మిని గొంతు నమిలి హత్య చేశారు. అనంతరం భయంతో ఇంటి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో మండల శివారులో పోలీసులు పట్టుకుని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మధుసూదన్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ గౌస్‌, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.


నిందితుల అరెస్ట్‌ చూపుతున్న సీఐ మల్లేష్‌